ప్రజాశక్తి

ఈవిఎంల గోడౌన్‌లో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు: ఈవిఎంల గోడౌన్‌ను కలెక్టర్ ఎం.హరి నారాయణన్ పరిశీలించారు. శుక్రవారం నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయ ప్రాంగణంలోని ఈవిఎంల గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ఉపయోగించిన వివి ప్యాట్ మెషిన్లలో మిగిలి ఉన్న పేపర్ రోల్స్‌ను తొలగించి, అనంతరం వివి ప్యాట్లను యథావిధిగా భద్రపరిచే ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఆర్‌డిఒ మలోల, రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుంచి రసూల్, వైసిపి నుంచి విజయ్ కుమార్ రెడ్డి, బిజెపి నుంచి శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి బాల సుధాకర్, ఆప్ నుంచి ధరణి కుమార్, ఎం. శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

కార్పొరేషన్ అధికారులు పక్కా 'ప్లానింగ్'..!

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసు సాగుతూ ఉంది. కార్పొరేషన్ సొమ్మును సుమారు రూ.15 కోట్ల మేర భోంచేసిన అధికారులు, ఒకప్పటి అధికారపార్టీ నేతలు, ప్రయివేటు వ్యక్తుల వ్యవహారం కొలిక్కి వస్తున్నట్లు కినిపిస్తోంది. ఓ ఐఎఎస్ అధికారి సంతకం ఫోర్జరీ చేసి క్రిమినల్ కేసు పెట్టాల్సిన కార్పొరేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలున్నాయి. కార్పొరేషన్ కార్యాలయంలోని కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు పక్కా వ్యూహం కూడా ఇక్కడ ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని సక్రమంగా ఉన్నా మార్టిగేజ్ కోసం కార్యాలయం చుట్టూ తిరిగినా ముఖం చాటేసే అధికారులు, ప్రయివేటు వ్యక్తులు భారీగా నగదు ముట్టచెబితే మాత్రం ఆఘమేఘాలపై సంతకాలు అయ్యాయని తెలుస్తోంది. నెల్లూరు విజిలెన్స్ అధికారులు ఈ కేసు అప్పగించగా, దీనిని తాజాగా ఒంగోలు విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. భావన హర్ష ఈ కేసును చూస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు ఈ కేసులో ఆర్థికపరమైన అంశాలను తేల్చనున్నట్లు తెలిసింది.

- ప్రత్యేక ఫైల్స్‌కే క్లియరెన్స్
- ఒంగోలు విజిలెన్స్ అధికారులకు కేసు అప్పగింత
- ప్రయివేటు వ్యక్తులే కీలక పాత్ర
- అన్ని సక్రమంగా ఉన్నా అప్పగించాల్సిందే
- మార్టిగేజ్ లబ్ధిదారులు లబోదిబో

ప్రజాశక్తి-నెల్లూరుప్రతినిధి

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్నతాధికారి సంతకాన్ని ఫోర్జరీ జరిగితే ఆశాఖ వైపు నుంచి స్పందన నామమాత్రంగానే ఉందని విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో క్రిమినల్ కేసులు పెట్టాల్సి ఉండగా కేవలం నలుగురు అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ కేసును విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. ఇక్కడ ఎస్‌పి స్థాయి అధికారి లేకపోవడంతో రాష్ట్ర విజిలెన్స్ డిజిప అధికారి లేఖ రాశారు. ఒంగోలుకు చెందిన విజిలెన్స్ అధికారి భావన హర్షకు అప్పగించినట్లు తెలిసింది. విచారణ జరిపి ఆర్థికపరమైన విషయాలు బయట పెట్టాలని ఆదేశించినట్లు సమాచారం. ఐఎఎస్ అధికారి సంతకం ఫోర్జరీ, తప్పుడు రికార్డులు సృష్టించడం, ఆర్థికమైన అంశాలు ఈ కేసులో ఉన్నప్పటికీ ఆ స్థాయిలో విచారణ జరగడం లేదనే సమాచారం. ప్రభుత్వానికి చేరాల్సిన నగదును కొందరు వైసిపి నేతలు అప్పనంగా కాజేశారని తెలుస్తోంది. ఇందులో కొందరు కార్పొరేటర్లు, బిల్డర్లు, అపార్ట్‌మెంట్ వాసులు, బిల్డర్లు, మార్టిగేజ్ కోసం మున్సిపల్ కార్యాలయం తిరిగినా, టౌన్ ప్లానింగ్ అధికారులను కలిసినా ఫైల్ ముందుకు కదిలేదికాదని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రయివేటు వ్యక్తుల ద్వారా భారీ మొత్తంలో అప్పగిస్తే మాత్రం రాత్రికి రాత్రి మార్టిగేజ్ రిలీజ్ అయిందని బాధితులు వాపోతున్నారు. నెల్లూరు నగర కార్పొరేషన్‌లో ఒంటే టౌన్ ప్లానింగ్ అధికారి ఒకరు, ఓ ప్రయివేటు లైసెన్స్ ఇంజినీర్ ద్వారా వెళితే మాత్రం పనిజరిగేదని చెబుతున్నారు. నెల్లూరు నగరంలోని ఆర్‌టిఒ కార్యాలయం వీధిలో ఓ బిల్డర్ తన భవనాలకు మార్టిగేజ్ కోసం అధికారుల చుట్టూ తిరిగినట్లు తెలిసింది. ప్లాన్ అప్రూవల్ కోసం రూ.3 లక్షలు, మార్టిగేజ్ కోసం రూ.8.50 లక్షలు నగదు చెల్లిస్తే తమ పని జరిగిందని బాధితులంటున్నారు. రికార్డులు చేతికొచ్చినా అవి నకిలీనా,? ఒరిజినల్ ? తెలియక తికమక పడుతున్నారు. నగరంలోని అనేక మంది లబ్ధిదారులు తమ రికార్డులు తీసుకొని పరిశీలిస్తున్నారు. తాము మోసపోయామని, తమ సర్టిఫికెట్లు రద్దు చేస్తారా ? ఒక వేళ చేస్తే మా నగదు పరిస్థితి ఏమిటనే ఆందోళన చెందుతున్నారు. తప్పుచేసిన ప్రయివేటు వ్యక్తులు గుమ్మనంగా ఉన్నారు. కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఓ ప్రజా ప్రతినిధి భర్త, ఆయన స్నేహితుడు శివకుమార్ పాత్ర పైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. వైసిపి కార్పొరేటర్లు, నేతలు ఇందులో ఉన్నట్లు సమాచారం.

ఒంగోలు విజిలెన్స్ అధికారులకు అప్పగింత..!

మార్టిగేజ్ వ్యవహారం కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి ఒక్కో భవనం, అపార్ట్‌మెంట్ నుంచి రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు దిగమింగేసిన విషయంలో . సుమారుగా రూ.15 కోట్ల మేర అవినీతి జరిగిందని చెబుతున్నారు. ఇందులో వాస్తవాలు నిగ్గు తేల్చడానికి విజిలెన్స్ విచారణ వేగవంతమైంది. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో టౌన్ ప్లానింగ్ అఫీసర్లు బి. ప్రవీణ్, ఎం. దేవేంద్రలు, 12, 24వ డివిజన్ సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులుగా విధులు నిర్వహించిన పి. నాగేంద్ర, కె. కార్తిక్ మాలవ్యలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును మరింత లోతుగా విచారించడానికి రాష్ట్ర విజిలెన్స్ అధికారులు ఒంగోలు విజిలెన్స్ అధికారి భావన హర్షకు అప్పగించినట్లు తెలిసింది. లోతుగా విచారిస్తే మరింత వ్యవహారం బయటకొచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

రోగులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఇంటూరి

రోగులను జాగ్రత్తగా చూసుకోండి

ప్రజాశక్తి-కందుకూరు

పేషెంట్లను చక్కగా చూసుకొని వారితో బాధ్యతగా వ్యవహరించండి... ఆస్పత్రికి గానీ, ప్రభుత్వానికి గానీ చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరించొద్దని, ముఖ్యంగా సమయపాలన పాటించాలని డాక్టర్లు, సిబ్బందికి ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు సూచన చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఎమ్మెల్యే నాగేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రోగులవద్దకు వెళ్లి వారికి అందుతున్న సౌకర్యాలు, చికిత్స గురించి ఆరా తీశారు. ఇన్ పేషెంట్లకు అందిస్తున్న ఆహారం నాణ్యతగా ఉందా, లేదా అని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇంద్రాణి, డాక్టర్లు, ఇతర సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ రోగులకు సరిపడా మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలోనే ఎక్కువ కాన్పులు జరిగేలా చూడాలని కోరారు. ఆసుపత్రిలో తగినంతమంది డాక్టర్లు, సిబ్బంది లేరన్న విషయం తనకు తెలుసని, వైద్య పరికరాల కొరత కూడా ఉందని చెబుతూ వీటిపై వెంటనే సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, పార్టీ నాయకులు చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, వడ్లమూడి సురేష్, మహర్షి శ్రీను, వున్నం వీరాస్వామి, గుర్రం మాల్యాద్రి, నాయకులు ఉన్నారు.

జూలై1న ఇంటి వద్దకే పింఛన్లు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పురపాలక సంఘంలో ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ప్రభుత్వం వారిచే జులై 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా అందరూ పింఛను దారులకు సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది ద్వారా ఉదయం 6 గంటల నుండి పింఛనుదారుల ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తారని కమీషనర్ ఎస్‌వి కృష్ణారెడ్డి తెలిపారు.

"అదానీ'.. మీ కాళ్లు పట్టుకుంటా..!

..కంటైనర్ టెర్మినల్ పునప్రారంభించండి
..ఎంఎల్‌ఎ సోమిరెడ్డి వేడుకోలు
..నాడు హెచ్చరించారు...నేడు అభ్యర్థిస్తున్నారు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"అదానీ మీ కాళ్లపట్టుకుంటా...మా ప్రాంత రైతులు, కార్మికుల కోసం రమ్మంటే వచ్చి ప్రాధేయపడుతా" అంటూ సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం టిడిపి, జనసేన, బిజెపి, సిపిఐ నాయకులతో కలిసి కృష్ణపట్నం పోర్టు సిఇఒ జెజెరావు కలిశారు. సిపిఎం నేతలు ఈ పర్యటనకు దూరంగా ఉన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇదే సమస్యపై కృష్ణపట్నం వెళితే సెక్యూరిటీ అడ్డుకుంది. హెచ్చరికల నేపథ్యంలో సిఇఒను కలిస్తే చూస్తాం, చేస్తాం అంటూ సమాధానమిచ్చారు. అధికారపార్టీ ఎంఎల్‌ఎ హోదాలో ఆయన శుక్రవారం ఉదయం ముత్తుకూరు చేరుకున్న ఆయనకు ప్రజలు భారీ స్వాగతం పలికారు. పోర్టు అధికారులు కాన్వాయ్‌తో ఆయనను పోర్టులోకి తీసుకెళ్లారు. సిఇఒ బయటకొచ్చి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. పెద్దఎత్తున రైతులు, రాజకీయపార్టీ నేతలతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. పోర్టు అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తన అభ్యర్థనను తెలిపారు. అనంతరం బయటకొచ్చి మాట్లాడారు. ఆ రోజు కంటైనర్ టెర్మినల్ తరలిపోలేదని నోటికొచ్చినట్టు నన్ను తిట్టిన కాకాణి గోవర్ధన్ రెడ్డికి కళ్ల కనిపించకపోతే కంటి డాక్టరుకు చూపించి చుక్కల మందు వేసుకొని ఇక్కడకు వచ్చి చూడాలన్నారు. టెర్మినల్ పునరుద్ధరణతో పాటు కూలీలకు కూలి పెంపు, ఉద్యోగుల వేతనాలు, పట్ట కట్టే కూలీల పెంపు తదితర అంశాలపై అధికారులతో చర్చించామన్నారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణే మా లక్ష్యం అన్నారు. ఎందరో రైతులు భూములిచ్చారని, నవయుగ కంపెనీ ఉన్నప్పుడు కంటైనర్ టెర్మినల్ అభివృద్ధి చెందిందని, 9 లక్షల టన్నులు ఎగుమతులు జరిగేవని, సుమారు వెయ్యి కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. ప్రస్తుతం రైతులకు సంబంధించిన రొయ్యలు, చేపలు, మిర్చి, పొగాకుతో పాటు గ్రానైట్ తదితర ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు సంబంధించిన రైతుల ఉత్పత్తుల ఎగుమతులను జరగకుండా చేశారన్నారు. కంటైనర్ టెర్మినల్ ను తరలించేసి దుమ్ముతో కూడిన ఐరన్ ఓర్, బొగ్గును జనం ముఖాన కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి మారిటైం బోర్డు పర్యవేక్షణలో ఉన్న పోర్టు నుంచి కంటైనర్ టెర్మినల్ తరలిపోతున్నా అప్పటి సిఎం జగన్మోహన్ రెడ్డి నోరు విప్పలేదని విమర్శించారు. సుమారు 12 వేల మంది పోర్టులోని కంటైనర్ టెర్మినల్‌పై ఆధారపడి జీవనం సాగించేవారు ఇప్పుడు రోడ్డున పడ్డారన్నారు. ఇప్పుడు ఆ ఉద్యోగాలు పోయి. ఆదాయం కూడా లేకుండాపోయిందన్నారు. పోర్టు కోసం తాతముత్తాతలు ఇచ్చిన ఇళ్లు, భూములు, పొలాలను త్యాగం చేస్తే చివరకి దుమ్ము, దూళి మాత్రమే మిగిలాయన్నారు. సీవీ రావు హయాంలోనే 10 లక్షల కంటైనర్ల ట్రాన్స్ పోర్టు జరిగితే, ఇక అదానీ చేతికొచ్చింది కాబట్టి 20 లక్షల కంటైనర్లకు పోతుందని భావించాం. కానీ పోర్టు ఇలా మునిగిపోతుందని కలలో కూడా ఊహించలేదన్నారు. వైజాగ్, ముంబయ్, చెన్నయ్ పోర్టులతో పోటీపడిన కృష్ణపట్నం పోర్టుకు ఈ పరిస్థితి రావడం జీర్ణించుకోలేక పోతున్నా మన్నారు. ఆనాటి మంత్రి కాకాణి పోర్టుకు వచ్చి కంటైనర్ టెర్మినల్ మూతపడలేదని, సోమిరెడ్డికి కళ్లు పోయాయని నోటికొచ్చినట్టు మాట్లాడారని, ఇప్పుడు వచ్చి సమాధానం చెప్పాలన్నారు. పోర్టు మొత్తం కలియ తిరిగారు. పోర్టు అధికారి వేణుగోపాల్ ఆయనకు పరిస్థితులు వివరించారు.

కంటైనర్ టెర్మినల్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

"ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తా"

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిందని, తమపై దాడులు, వేధింపులు చోటు చేసుకుంటాయని వైసిపి నాయకులు, కార్యకర్తలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికీ పార్టీ, తాను అండగా నిలుస్తామని మాజీ మంత్రి కాకాణి గోర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండల వైసిపి కార్యాలయంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు పాలన అభివృద్ధి, సంక్షేమంతో కాకుండా విభిన్నంగా విధ్వంస కాండతో ప్రారంభించారన్నారు. ఆధిపత్యం కోసం వైసిపి నాయకులపై, వారి ఆస్తులపై తెలుగుదేశం నాయకులు దాడులకు తెగబడుతున్నారన్నారు. రాష్ట్రంలో పార్టీలు అన్ని ఏకమైన జగన్మోహన్ రెడ్డి ఒక్కరికే ఎన్నికల సంగ్రామంలో పోటీ చేస్తే 40శాతం ఓటు శాతాన్ని ప్రజలు అందించారన్నారు. ప్రజలకు అండదండలు అందించడమే ప్రధాన ధ్యేయంగా పార్టీ అడుగులు వేస్తుందన్నారు. తమ ప్రభుత్వ హాయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి వాడ, ప్రతి వీధి అభివృద్ధి చేశామన్నారు. రైతులకు, సామాన్యులకు అందుబాటులో ఉండి, అండగా నిలిచి, అండదండలు అందించామన్నారు. సర్వేపల్లి ప్రజలకు అధికారంలో ఉన్నా, లేకపోయినా మీ ఇంటిబిడ్డగా అండగా నిలుస్తామన్నారు.తెలుగుదేశం పార్టీ చోటా నాయకుల ఉడత బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు.

పారదర్శకతతో కోరుకున్న చోటుకు బదిలీ

ప్రజాశక్తి-నెల్లూరు: పోలీసు సిబ్బంది బదిలీలు కోరుతూ చేసుకున్న విజ్ఞప్తులను పరిశీలించి పారదర్శకతతో వారు కోరుకున్న ప్రాంతంలో ఖాళీల ఆధారంగా బదిలీలు చేస్తూ ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ ఉత్తర్వులు అంద జేశారు. శుక్రవారం నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీసు వెల్ఫేర్ డే కార్యక్ర మంలో ఆయన పాల్గొ న్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు సిబ్బంది నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అంకితభావంతో విధులు నిర్వహించాలి. అనధికారికంగా గైర్హాజరు కావద్దని హెచ్చరించారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుల్స్ సమస్యల అర్జీలపై సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసు సిబ్బందికి సంబంధించిన బదిలీలు, గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, సస్పెండ్ నుంచి రిలీవ్, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యూటేషన్, భద్రత, అనారోగ్యం కారణంగా బదలాయింపు సంబంధిత అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అర్జీలు స్వీకరించామన్నారు. సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి, అపరిష్కృతంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కారం నిమిత్తం, తగిన సూచనలు చేసి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు: కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లోని పిల్లలకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్ విచ్చేసి విద్యార్థులకు యూనిఫారం పంపిణీ చేసి విద్యార్థుల తల్లిదండ్రుల ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపాలని, 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైనా బడి మానేసి ఉంటే వారిని బడిలో చేర్పించా లన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు, స్థానిక నాయకులు దామోదర రెడ్డి, మల్లి, రవి, డేవిడ్, శ్రీనివాసులు, బాల సిద్ధయ్య, రవీంద్ర, సుబ్రహ్మణ్యం, భాస్కర్ నాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-విడవలూరు

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని వ్య.కా.స. జిల్లా కార్యదర్శి మంగళపుల్లయ్య తెలిపారు. మండలంలోని అన్నా రెడ్డిపాలెం గ్రామంలో జరుగుతోన్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ పూర్తయి మూడు నెలలు గడిచింది పనులు లేక కూలీలు అనే ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని కోరారు. ఇంకా అనేక మండలాల్లో అన్ని గ్రామాల్లో కూడా పనులు ప్రారంభించలేదని వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో చేసిన పనికి నాలుగైదు వారాలుగా కూలీల బకాయిలు ఉన్నాయన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని, పేస్లిప్ లు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో చట్ట ప్రకారంగా కల్పించాల్సిన వసతులు, మెడికల్ కిట్లు, తాగునీరు, నీడ కల్పించాలన్నారు.పనిలో జిపిఎస్ విధానాన్ని తీసివేయాలని, కూలీలకు మూడు కిలోమీటర్ల దాటితే రవాణా వసతి కల్పించాలని కోరారు. నిత్యావసర ధరలు పెరిగిన ఈ పరిస్థితుల్లో కూలీలకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని, రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కొత్తగా ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీకి నిధులు పెంచి ఉపాధి హామీ పనులు పటిష్టంగా చేయించి పేదలను ఆదుకోవాలన్నారు. ఆ దిశగా కొత్త ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. జిల్లా అధికారులు కూడా జిల్లాలో ఉపాధి హామీ పనులు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మోడేగుంట రామచంద్రయ్య, ,రైతు సంఘం మండల కార్యదర్శి మడపర్తి అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

జూలై1న పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 1వ తేదీన ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. శుక్ర వారం ఆయన పెన్షన్ల వివరాలను వెల్లడించారు. మండలంలోని 7,544 మందికి పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అరియర్స్ సహా పెంచిన పింఛన్ సొమ్ము మొత్తం ఐదు కోట్ల 21 లక్షల 45 వేల రూపాయలు ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. పింఛన్‌దారులు ఒకటవ తేదీన వారి వారి గృహాల వద్దనే కేటాయించబడిన సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పింఛను తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సచివాలయ సిబ్బందితో పాటు అదనంగా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పెన్షన్ల పంపిణీ విధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ మేరకు జులై 1వ తేదీన పెన్షన్ దారులు ఇంటి వద్దనే పెన్షన్లు తీసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

'పిన్నెల్లి'తో మాజీమంత్రి కాకాణి భేటి

ప్రజాశక్తి-నెల్లూరు: న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు శుక్రవారం భేటి అయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చిన వెంటనే టిడిపి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజాపాలన విస్మరించిన టిడిపి ప్రభుత్వం వైసిపి నాయకులపై కేసులు బనాయించడం, జైళ్లకు పంపడం, కార్యకర్తలకు సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేయడం వంటి కార్యక్రమాలకు ప్పాలడటం దారుణమన్నారు. అక్రమంగా బనాయిస్తున్న కేసులకు, జైళ్లకు వెళ్లేందుకు వైసిపి కార్యకర్తలు, నాయకులు భయపడే వారు కాదని స్పష్టం చేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా టిడిపి ప్రభుత్వ అరాచకాలను ఎదుర్కొని, పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు.

కేసు కొట్టివేయడంతోబయటకి వచ్చిన నేతలు

కేసు కొట్టివేత

ప్రజాశక్తి-కందుకూరు

2017డిసెంబర్25 కందుకూరు మండలం, ఓగూరు వద్ద పోకూరు గ్రామానికి చెందిన దాదాపు పదిమంది మాదిగలు చర్చికి ఆటోలో బయలుదేరి వెళ్తుండగా రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ఢీకొనగా ప్రమాదానికి గురయ్యారు. అందులో ఇద్దరు అత్యాల.సువార్తమ్మ, ఎండ్లూరి.ఇమ్మానియేలులు మరణించగా కొంతమందికి రక్తగాయాలయ్యాయి. మృతులకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అ నాడు ధర్నా చేశారు.దాంతో కందుకూరు పట్టణ, రూరల్ పోలీస్‌లు సెక్షన్ల ప్రకారం కేసులను నమోదు చేశారు.. ఏడు సంవత్సరాల పాటు ఈ కేసును కందుకూరు పట్టణంలోని ప్రముఖ అడ్వకేట్స్ గౌడి పేరి కోటేశ్వరరావు, కత్తి. విజయ ప్రభులు వాదించారు. నేరం రుజువు కానందున కోర్టులో శుక్రవారం కేసులను కొట్టివేశారు. యాక్సిడెంట్ లో చనిపోయిన మృతులకు అప్పట్లో నష్టపరిహారం ఇప్పించడం, వారి కుటుంబాలకు ఆర్థికంగా న్యాయం చేయటం జరిగింది. ఈ కేసులో ఎమ్మార్పీఎస్ నాయకులు సూరపోగు శ్యాం , జలదంకి నరసింగరావు, పెరికే లక్ష్మణ్, ఉచ్చులూరి. సుబ్బారావు, సిపిఎం నాయకులు జీవీబీ కుమార్, మిట్టానోసల.సుబాను తదితరులున్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు: దేశవ్యాప్తంగా వైద్య,విద్య కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్. 2024.. ఎగ్జామ్ రద్దు చేయాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎం.సునీల్ మాట్లాడుతూ ఈమధ్య దేశ వ్యాప్తంగా జరిగిన నీట్ ఎగ్జామ్‌లో భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయని తెలిపారు. కష్టపడి చదివిన విద్యార్థులకు సీట్లు రాకుండా చదువురాని విద్యార్థులకు సీట్ల వచ్చే విధంగా కొంతమంది వ్యక్తులు చేశారు. ఈ వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. పేపర్ లీకేజీ కారణమైన ఎన్‌టి ఏ సంస్థను రద్దు చేయాలన్నారు. సిబిఐ చేత పూర్తిస్థాయిలో ఎంక్వైయిరీ చేసి బాధ్యులకు శిక్ష పడే విధంగా చేయాలన్నారు. వెంటనే నీట్ పరీక్షను రద్దుచేసి మరలా ఎగ్జామ్ నడిపించాలని పిడిఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. దేశంలో నరేంద్ర మోడీ కేంద్ర విద్యా శాఖ మంత్రి బాధ్యత తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షారుఖ్.. టౌన్ అధ్యక్షులు ఆశిర్, టౌన్ సభ్యులు ఎస్.కె ఖాదర్‌బాషా, మనోజ్, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న పిడిఎస్‌యు

టోర్నమెంట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -నెల్లూరు : నగరం లోని నెల్లూరు క్లబ్ లో జిల్లా క్యారమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్ - 2024 ను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఏపీ ట్రాన్స్ కో మాజీ డైరెక్టర్ జె.వెంకటేశ్వరరావు , రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ సీనియర్ వైస్-ప్రెసిడెంట్ కాకుల సుబ్బారావు, నెల్లూరు క్లబ్ అధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, మారంరెడ్డి మహేష్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.జిల్లా క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ క్యారమ్ ఆటను జిల్లాలో అభివృద్ధి చేస్తామని, క్యారమ్స్ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తారని హామీ ఇచ్చారు. జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి వీఆర్ ఆర్ శ్రీధర్, ఈ టోర్న మెంట్ లో వచ్చిన ర్యాంక్స్ ను అనుసరించి రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో బర్న బస్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ పరిచయ కార్యక్రమం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు డివిజన్లో నూతనంగా ఏర్పడిన టిఎన్‌టియుసికి అనుబంధ సంస్థ అయినటువంటి టిఎన్‌వికెఎస్ రిజిస్టర్ నెంబర్ 1245 గుర్తింపబడిన యూనియన్ కందుకూరు విద్యుత్ సంస్థలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం కందుకూరు ఈ ఈ తో పరిచయ కార్యక్రమం శుక్రవారం జరిగింది. డివిజన్ ప్రాంతీయ అధ్యక్షులుగా జి నజీర్ బాబు, డివిజన్ ప్రాంతీయ కార్యవర్గ అధ్యక్షులుగా పి.మాధవరెడ్డి, డివిజన్ ప్రాంతీయ కార్యదర్శిగా టీవీ కష్ణారావు, డివిజన్ ప్రాంతీయ అదనపు కార్యదర్శిగా ఎస్.కె ఖాదర్ భాషా ,డివిజన్ ప్రాంతీయ కోశాధికారిగా ఎస్ వి రమేష్ బాబు తదితరులని విద్యుత్ కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ పరిచయ కార్యక్రమాలకు హాజరైనే విద్యుత్ నాయకులు స్టేట్ , డిస్కం కార్యదర్శి మోటుపల్లి శ్రీరామమూర్తి ,రీజినల్ ప్రాంతీయ అధ్యక్షులు వి మధుసూదన్ రావు, రీజనల్ ప్రాంతీయ కార్యదర్శి డివి శేషయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యుత్ కార్మికులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. వారికి కందుకూరు డివిజన్ తరపున డివిజన్ ప్రెసిడెంట్ జి.నజీర్ బాబు, డివిజన్ కార్యదర్శి టీవీ కృష్ణారావు, డివిజన్ కార్యవర్గ సభ్యులు ధన్యవాదలు తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఆఫ్రాన్ మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు : సోమశిల ప్రాజెక్టు ప్రాంతంలో వరదలకు దెబ్బతిన్న ఆఫ్రాన్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి. ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని సోమశిల ప్రాజెక్టు ఎస్ఇని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 వ సంవత్సరం వచ్చిన తుపాన్ వరద వలన ఆఫ్రాన్ కట్ట పూర్తిగా దెబ్బతినిందని, గతంలో అధికారంలోని ప్రభుత్వం ఈ ఆఫ్రాన్ మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రాబోయే వర్షాకాల రుతుపవనాల ప్రభావం వలన లేదా మరలా తుపాన్ లాంటి పరిణామాలు సంభవిస్తే తిరిగి సోమశిలకు వరదలు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. వరదలు సంభవిస్తే దాని వలన నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో పది లక్షల ఎకరాల ఆయకట్టు, నెల్లూరు చిత్తూరు చెన్నయ్ జిల్లాలకు తాగునీటి అందించే ఈ ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా ఉందని అధికారులకు తెలియజేశారు. ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పనులు ప్రారంభించే విధంగా అధికారులు తగిన సూచన చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టినటువంటి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ఈ విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి భవిష్యత్తులో గతంలో జరిగిన విధంగా ఎటువంటి తిరిగి నష్టం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సోమశిల ప్రాజెక్టు ను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వడ్డే హనుమా రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ షాన్‌వాజ్, గంగపట్నం రమణయ్య పాల్గొన్నారు.

'కాకర్ల'ను కలిసిన ఎపి హంస యూనిట్

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌ను ఉదయగిరి తాలూకా ఎపి హంస యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం వింజమూరు బొమ్మరాజు చెరువు టిడిపి కార్యాలయంలో ఉదయగిరి తాలూకా ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఎపి హంస ప్రెసిడెంట్ కలవాలి. వెంకటసుబ్బయ్య, సెక్రెటరి ఎస్.జె. నౌషాద్‌బాబు, మహిళా సెక్రెటరీ బీబీజాన్ ఆధ్వర్యంలో ఉదయగిరి హంస నాయకులు ఎంఎల్ఎను శాలువా పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ హంస యూనియన్ నాయకులతో ఆరోగ్య శాఖ విషయాలపై, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై క్షుణ్ణంగా చర్చించారు. ఉద్యోగుల యొక్క సమస్యలను సానుకూలంగా పరిష్కారం చేస్తానని ఆయన తెలిపారు. ఆరోగ్యశాఖలో గ్రామస్థాయిలో ప్రజలకు అందుతున్న ఆరోగ్య కార్యక్రమాలు టీకా కార్యక్రమాల గురించి ఆయన చర్చించారు. ప్రజల ఆరోగ్య మెరుగు కోసం మీరు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని, ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ కప్పు.నారాయణరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.జాకా మొహిద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆకుముల శ్రీనివాసులు, ట్రెజరర్ పిక్కిలి.హసనయ్య, వైస్ ప్రెసిడెంట్లు వై.శ్రీనివాసులు, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కావలి : నెల్లూరు పట్టణంలో శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలో "ది పూర్ పీపుల్ వాలంటరీ ఆర్గనైజేషన్" ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "పిల్లల ఆనంద నిలయం"లో శుక్రవారం ఉచిత విద్యార్థుల కోసం బోధనోపకరణాలు పంపిణీ చేశారు. దాతల సహాయంతో పిల్లలకు పలకలు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, ఎరేజర్, షార్పనర్, స్కేల్స్, జామెంట్రీ బాక్సులు ఇచ్చామని ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు చేవూరు చిన్న తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి బిట్రగుంట : గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా భూ ఆక్రమణలు, అక్రమ లేఔట్లు భూ సమస్యలపై చర్యలు తీసుకోవాలని తహశీల్దారు ఎస్.వెంకటరత్నంను జనసేన నాయకులు కోరారు. శుక్రవారం తహశీల్దారు మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు పలువిషయాలను తెలియజేశారు. మండల అధ్యక్షులు తిరుమలశెట్టి వెంకటేష్, ఉపాధ్యక్షులు గంపాల కార్తీక్, మండల కార్యదర్శులు అమెరిశెట్టి కాలేబు, కొండూరు శివప్రసద్, కంబాల యతిరాజులు నాయుడు, జనసేన నాయకులు కొమరి ప్రకాష్, అమిరిశెట్టి హరీష్, అమిరిశెట్టి అర్జున్, లక్కాకుల హరీష్ ఉన్నారు.

ఆర్‌టిసి ఆదాయం రూ.6.52లక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి : దుత్తలూరు మండలం నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయగిరి ఆర్‌టిసి డిపోకు రూ.6.52 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 23వ తేదీ నుండి ప్రారంభమైన వెంగమాంబ బ్రహ్మోత్సవాలలో భాగంగా 26, 27 రెండు రోజుల్లో 24 ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా నిరంతరం సర్వీసులు నడిపామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది రూ.6.52 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కోవూరు : కొడవలూరు మండలంలోని నార్త్‌రాజుపాలెంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పుస్తకాన్ని శుక్రవారం కళాశాల చైర్మన్ పి.గుణశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని రచించిన ప్రొఫెసర్ వెంకట్ నాగేంద్ర, దీప్తిలను అభినందించారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగ పరిశోధన వ్యాసాలను పుస్తకాలను అందించడంలో తమ విద్యార్థులకు ఎప్పుడు తోడుగా ఉంటానన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు మాట్లాడుతూ డిప్లొమా బిటెక్ విద్యార్థులకు రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ గిరీష్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ఇంటూరికి సత్కారం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని చుట్టుగుంట రోడ్డులోగల శ్రీరామ్ నగర్ కాలనీవాసులు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుపై అంతులేని అభిమానాన్ని కురిపించారు. ఎమ్మెల్యేగా ఘనవిజయం పట్ల అభినందనలు తెలియజేస్తూ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన స్థానిక నాయకుడు తలతోటి మస్తాన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పోతురాజుమిట్ట దగ్గర నుంచి కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. మధ్యలో గజమాలతో స్వాగతం పలికి, అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. సన్మానం అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన ఎన్నికల్లో కందుకూరు పట్టణ ప్రజలు తనపై చూపిన అభిమానం, ప్రేమ ఎన్నటికీ మరిచిపోనని చెప్పారు. కందుకూరు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనంత మెజారిటీ తనకు అందించారని కతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కందుకూరు పట్టణంలో గత రికార్డులను బద్దలు కొట్టి 7 వేలకు పైగా ఓట్ల ఆధిక్యత ఇచ్చిన పట్టణ ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. పట్టణంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని, ఏ ఒక్కరికి కూడా ఎలాంటి హాని జరగకుండా, చెడు సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని మరొక్కసారి ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, వార్డు అధ్యక్షులు కోటపూరి శ్రీను, పార్టీ నాయకులు కంద్రా మాల్యాద్రి, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, వడ్డేళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీను, షేక్ సలాం, సవిడి బోయిన వెంకటకష్ణ, చీదెళ్ల వేణుగోపాల్, సురేష్ రెడ్డి, పులి నాగరాజు, వార్డు నాయకులు రామకోటేశ్వరరావు, మామిడి మాల్యాద్రి, ఏచూరి మాల్యాద్రి, గుమ్మడి మాల్యాద్రి, బూసి సురేష్, నవీన్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి..

ప్రజాశక్తి నెల్లూరు సిటీ : అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి ప్రభుత్వ భూమి పట్టాలను కొల్ల కొట్టారని.. వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర సమితి నాయకులు వాటంబేటీ నాగేంద్ర పేర్కొన్నారు. నెల్లూరు సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో ఇరగాలమ్మ సంఘం వద్ద ఉన్న ప్రభుత్వ భూమి 85 సెంట్లను గత ప్రభుత్వంలో అధికారుల అండదండలతో ఎక్కడికక్కడ కబ్జాకు గురవడం బాధకరమన్నారు. అధికారం ఉందనే ధీమాతో ఫోర్జరీ సంతకాలతో ఫోర్జరీ పట్టాలతో ప్రభుత్వ భూములు లేఅవుట్లు వేసుకుని విచ్చలవిడిగా ఆక్రమణలు చేశారన్నారు. ఈ విషయం తెలిసి కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనక అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. కార్పొరేషన్ అధికారుల పై చట్టపరంగా, శాఖా పరమైన చర్యలు తీసుకోకపోతే సిపిఐ ఉద్యమిస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ నగర నాయకులు పి లీలా మోహన్, కె.సతీష్, లజపతిరాయ్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని పరిరక్షించే క్రమంలో నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు లాడ్జీలను పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారని ఎస్పి కె.ఆరీఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత లాడ్జిల్లో పోలీసులు ప్రతి గదినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. రాత్రి వేళల్లో లాడ్జిలలో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ, వారి వివరాలపై ఆరా తీశారన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఎవరైనా అనుమానాస్పదంగా అన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచనలు చేశారు.

పిల్లలందరూ స్కూల్‌కెళ్లాలి

ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'పనికెందుకు తొందరా.. బడికి పోదాం ముందరా..' ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నియోజకవర్గం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పాల్గొన్నారు. శుక్రవారం వింజమూరులో డిప్యూటీ డిఇఒ పి.రఘురామయ్య ఎంఇఒ ఎం.మధుసూదన్ రెడ్డి హెచ్ఎంలు సిహెచ్ మాలకొండయ్య డి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జెడిపి బాలుర ఉన్నత పాఠశాల జెడిపి బాలబాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీ స్థానిక జెడిపి బాలుర ఉన్నత పాఠశాల నుండి బంగ్లా సెంటర్ పంచాయతీ బస్టాండ్ వరకు నినాదాలు చేస్తున్న ర్యాలీలో ముఖ్య అతిథిగా కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేయగా ఈ సందర్భంగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ పనికి వెళ్లకుండా తొందరా.. బడికి పోదాం ముందరా.. అంటూ సందేశం ఇచ్చి ప్రతి తల్లి తండ్రి వారి బిడ్డలని బడికి పంపించాలని కోరి నేటి బాలబాలికలు చదువుతూ ఎదగాలన్నారు. అదేవిధంగా విద్యాశాఖ డిపార్ట్‌మెంట్‌కు అనుసంధానం గా ఉన్న మిగతా డిపార్ట్‌మెంట్లు కూడా పిల్లలను బడికి చేర్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి చిన్నారి బడిలో ఉండాలన్నారు. విజన్ ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని విద్యను ప్రోత్సహిస్తూ విద్యార్థుల ఖర్చుల నిమిత్తం తల్లికి వందనం ద్వారా ప్రతి బిడ్డకు ఏడాదికి రూ.15వేలు అందజేస్తున్నారని తెలిపారు. పేదరిక నిర్మూలనకు చదివే సరైన మార్గమని నేటి యువతరానికి ముందు చూపు మంత్రి నారా లోకేష్ అని ఆయన అన్నారు. ముందుచూపుతో అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్న నారా లోకేష్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. జులై 1వ తేదీన పింఛన్‌దారులకు గత మూడు నెలల బకాయిలతో కలిపి రూ.7వేలు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో 65లక్షల మంది లబ్ది దారులకు రూ.4400 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 319961 మంది లబ్దిదారులకు రూ.218. 87 కోట్లు ఇస్తామన్నారు. సచివాలయాల సిబ్బంది ద్వారా 1వతేదీ ప్రతిఒక్క లబ్దిదారునికి అందజేస్తామన్నారు. వింజమూరు మండలంలో 5670 మందికి 3కోట్ల 84 లక్షల 20వేల 500రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గుండె మడగులో జరుగు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు గొంగటి రఘునాథరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, గూడా నరసారెడ్డి, కోడూరు నాగిరెడ్డి, పాములపాటి మాలాద్రి, మంచాల శ్రీనివాసులు, వనిపెంట సుబ్బారెడ్డి, చల్లా శ్రీనాథ్ యాదవ్, చల్లా మాల్యాద్రి యాదవ్, కొండ పల్లి వెంకటేశ్వర్లు, పల్లా మధు జనసేన మండల అధ్యక్షులు బండారు సత్య నారాయణ, బిజెపి మండల అధ్యక్షులు డేగ మధు యాదవ్, పిడి ప్రభాకర్ రెడ్డి, పిఇటి వెలుగోటి కృష్ణ, సిడిపిఒ పద్మజా కుమారి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను ఖండించాలి

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-జలదంకి

జలదంకిలో సుర చెంచురెడ్డి భవనంలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ పార్లపల్లి జిల్లా గడుపు లిబ్బీ మండలం చివర గ్రామంలో దళితులపై అదే గ్రామానికి చెందిన పలువురు పెత్తం దారులు దాడి చేశారు. శివం గ్రామానికి చెందిన 14 మంది దళితులకు 1970లో 28 ఎకరాలకు సంబంధించి డీఫారం పట్టాలు ఇచ్చారు. అంతకు ముందు వరకు ఆ భూమిని పెత్తందారులు సాగు చేస్తూ ఉండేవారు అప్పటి నుండి దళితులంతా 1970 నుండి ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉన్నారు. ఆ భూమిని ఎలాగైనా లాక్కోవాలని అదును కోసం పెత్తందారులు ప్రయత్నించడంలో దళితులకు పెత్తందారులకు మధ్య గొడవలు జరుగుతు న్నాయి. ఈ నేపథ్యంలో ఆ భూమికి సంబంధించి ఉన్న భూమిని సర్వేనెంబర్ వేసి కోర్టు నుండి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చి దళితులను సాగు చేయనీయకుండా అడ్డుపడ్డారు. పది రోజుల నుండి వర్షాలు కురుస్తుండడంతో దళితులంతా పొలంలో పని నారు పోశారు. గురువారం పొలంలో పని చేసుకుంటున్న దళితులపై పెత్తందారులు కర్రలతో దాడి చేశారు. మహిళలని చూడకుండా అమానుషంగా వ్యవహరించారు. ఐదుగురు దళితులకు గాయాలైనాయి. తక్షణమే పెత్తందారులపై పోలీసులు అట్రాసిటీ కేసు పెట్టి దళితులకు అండగా ఉండాలని ఆ భూమిని వారి సాగు చేసుకోవడానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వ్యకాసం మండల కార్యదర్శి ఎం.అంతోనిబాబు పాల్గొన్నారు.

వైసిపి నేత ప్రహరీ ధ్వంసం

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు తన స్థలంలో ఎవరూ లేని సమయంలో అర్ధరాత్రి తన స్థలంలో నిర్మించుకొన్న ప్రహరి గోడను ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని కోవూరు ఎఎంసి చైర్మన్ పచిపాల రాధాకృష్ణ రెడ్డి అన్నారు. కోవూరులోని ఆయన అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-ఉదయగిరి

శ్రీ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు 2024 ఆదాయం రూ.56,82,220 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వెట్టిగుంట ఉషాశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం దుత్తలూరు మండలం నర్రవాడ శ్రీ వెంగమాంబ ఆలయ హుండీలు లెక్కింపు ద్వారా ఆదాయం 26,92,606లు వివిధ టిక్కెట్లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా ఆదాయం రూ.16,73,970, అన్నదానం విరాళాల ద్వారా ఆదాయం రూ.5,15,644 తాత్కాలిక అంగళ్ల అద్దెల వసూలు చేసుకొను హక్కు ద్వారా ఆదాయం రూ.800,000 మొత్తం ఆదాయం రూ.56,82,220 వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానములో తేది 23 అదివారం నుండి తేది 27వ తేదీ గురువారము వరకు అమ్మవారి బ్రమ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సహాయ సహకారాలు అదించిన శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి జిల్లా దేవదాయ శాఖాధికారికి, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులకు గ్రామస్తులకు, మీడియా ప్రతినిధులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు కార్యనిర్వహణాధికారి కృతజ్ఞతలు తెలిపారు.

రక్తహీనత నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సికి ల్ సెల్ ఎనిమియా రక్తహీనత కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఎల్ ఆర్ టు మిక్స్ కాలనీలో ఎస్‌టి ఏరియాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైడే ఫ్రైడే గురించి వివరించారు. సిడిపిఒ పి.సునీలత తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ ఎం.రత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుప్రజ, తల్లులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మొక్కను నాటుతున్న హెచ్ఎం అంకయ్య

మొక్కల నాటి పర్యావరణాన్ని కాపాడమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంకయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలంలోని మహిమలూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అంకయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కల నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటి వద్దకే పెన్షన్

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని 6,259 మంది లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ జులై ఒకటో తేదీన ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని మండల ప్రజాభివృద్ధి అధికారి తాజ్‌మస్రూర్ శుక్రవారం తెలిపారు. ఒక్కొక్క సచివాలయం 50 మందికి అందించే విధంగా 130మందికిపైగా సిబ్బందికి విధులు అప్పగించామన్నారు. వృద్ధులు, వితంతువులు, నేతన్నలు, మత్యకారులు, కల్లుగీత కార్మికులు, హెచ్ఐవి బాధితులకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు వెయ్యి రూపాయలు చొప్పున జూలై ఒకటో తేదీన రూ.7వేలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. దివ్యాంగులకు రూ.6వేలు పెంచారన్నారు. కుష్టు బాధితులకు రూ.6వేలు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్నవారికి రూ.10వేలు ఇవ్వనున్నారు. మంచానికి పరిమితమైన వారికి రూ.15వేల పెన్షన్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 6గంటల నుంచి పెన్షన్ ఇస్తారని ఒకటి, రెండు తేదీ లోపల పూరి చేస్తారని లబ్ధిదారులు కచ్చితంగా ఈ రెండు రోజులు ఇంటి వద్ద ఉండాలని ఆయన తెలిపారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : జులై ఒకటో తేదీ ఇంటి వద్దకే పెన్షన్లు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పెన్షన్ కార్యక్రమం సిబ్బంది ఇంటి వద్దకే పెన్షన్ నగదును అందజేస్తారన్నారు. మండల పరిధిలోని 17 పంచాయతీల్లో 4963 పెన్షన్‌లు ఉన్నాయన్నారు. వీరి కోసం రూ.3.36కోట్లు సచివాలయాల సిబ్బంది చేతికి అందజేస్తామన్నారు. పెన్షన్ అందజేసేందుకు సచివాలయ, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల సిబ్బందితో పాటు అంగన్‌వాడీ సిబ్బంది ఉంటారన్నారు. పెన్షన్‌దారులు తమ తమ ఇంటి వద్దనే ఉంటూ సిబ్బందికి సహకరించి పెన్షన్ అందుకోవాలన్నారు.

'ఉపాధి' ఆడిట్‌పై గ్రామసభ

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల, మినగల్లు, రేవూరు, బొమ్మవరం గ్రామాలలో శుక్రవారం ఉపాధిహామీ ఆడిట్ గ్రామసభ జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాలలో జరిగిన ఉపాధి హామీ పనుల గురించి డిఆర్‌పిలు చదివి వినిపించారు. రెండోరోజు గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. కార్యక్రమంలో ఎపిఒ దయాసాగర్, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపిటిసిలు, టిడిపి నాయకులు కాసా సుబ్బారెడ్డి, గూడూరు శ్రీకాంత్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, పరిశీలకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లవోలులో 'బడి బాట'

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పల్లవోలు, తిక్కవరం గ్రామాల్లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రాధ ఆధ్వర్యంలో శుక్రవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరిగే బడి బాట కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ స్కూల్లో 4సంవత్సరాలు వయస్సు కలిగిన బాలబాలికలను చేర్పించాలని కోరుతూ ఇంటింటా తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ స్వప్న, సుజాత జయకుమారి, అంగన్‌వాడీ వర్కర్ రజని, ఎఎన్ఎం, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-కోవూరు

మండల పరిధిలోని కోవూరు కలుజు గుమ్మళ్లదిబ్బ మధ్యలో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పాటూరు నుంచి కోవూరు వస్తున్న ట్రాక్టర్ నెల్లూరు నుంచి యల్లాయపాలెం పోతున్న ప్రయివేట్ బస్సును ట్రాక్టర్ ఢీకొనగా ట్రాక్టర్ రెండు ముక్కలైన ఘటన చోటు చేసుకుందిజ వివరాల్లోకెళ్తే.. ప్రమాదానికి గురైన ట్రాక్టర్ డ్రైవర్ ప్రాణాపాయ స్థితిలో నుంచి బయటపడ్డాడు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో బస్సులో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. కానీ రాత్రి కావడంతో పాటూరుకు వెళ్ళవలసిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎంఎల్ఎ 'కాకర్ల'కు స్వాగతం

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఎంఎల్ఎ 'కాకర్ల'కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ మానసా దేవి అమ్మవారి పదవ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఎంఎల్ఎ కాకర్ల సురేష్‌కు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మేళతాళాలు భాజా భజంత్రీలతో ఘనస్వాగతం పలికి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలను అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని సకాలంలో వర్షాలు పడి రైతులు పాడిపంటలతో హాయిగా వర్ధిల్లాలని అమ్మవారు మానస దేవిని ప్రార్థించానని తెలిపారు. అలాగే తూర్పు రొంపిదొడ్ల గ్రామంలోని ప్రజలు తనకు మద్దతు పలికి మంచి మెజార్టీతో గెలిపించారని గెలిపించిన ప్రతిఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. అనంతరం కమిటీ సభ్యులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రావు, మాజీ మండల కన్వీనర్ వెంకయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి మహేశ్వర రావు, నాదెండ్ల రాజా, మల్లంపాటి వెంగయ్య, గణేశ్వరపురం యువనాయకులు పేరం సుధాకర్ రెడ్డి, తెలగొర్ల వెంగటయ్య, మల్లంపాటి మాధవరావు, గ్రామస్తులు తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సచివాలయాల్లో సిఎంల ఫొటోలు

ప్రజాశక్తి-కావలి

33, 37 వార్డులకు సంబంధించిన సచివాలయాన్ని సందర్శించి ప్రొటోకాల్, ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కావలి నియోజకవర్గం ఎంఎల్ఎ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఫొటోలు సచివాలయ ఆఫీసులో శుక్రవారం టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో జూన్ ఒకటో తేదీన ఇవ్వాల్సిన పెన్షన్ల గురించి చర్చించారు. కార్యక్రమంలో వార్డు పార్టీ ఇన్‌ఛార్జి జ్వాలా చంద్రశేఖర్, నేరెళ్ల సుబ్బారావు, పట్నం శివ, గట్టం శీను, భవనాసి వెంకటేశ్వర్లు, పి.సురేష్, అర్చక సంఘం అధ్యక్షులు శ్రీనివాస ఆచార్యులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షులకు అభినందనలు

శుభాకాంక్షలు తెలియజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-కావలి

కావలిలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, కుదువ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన మొగలపల్లి రాజా, కోటా రమేష్‌లను శుక్రవారం "కావలి సెవెన్ లైన్స్ సభ్యులు" శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు మొగలపల్లి రాజా, కుదువ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో అధ్యక్షులుగా ఎన్నుకున్న బంగారు, కుదువ వ్యాపారస్తులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. తమ ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి సహాయ సహకారాలతో బంగారు వ్యాపారస్తులకు ఏ కష్టం వచ్చినా ముందుండి నిలబడి పనిచేస్తామని తెలిపారు. వారికి అండగా నిలిసి సమస్యలను పరిష్కరిస్తామని, ఈరోజు తమను సత్కరించిన సెవెన్ లైన్, సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సెవెన్ లైన్స్ సభ్యులు అనుములశెట్టి శివ, గాదంశెట్టి వేణు, పాదర్తి నాగరాజు, సువర్ణ శ్రీను, పెట్టుగాని రమేష్, పెసల పవన్, సుబ్బారావు, గాదంశెట్టి రవి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు మార్చాలని వినతి

ప్రజాశక్తి-దగదర్తి



శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు మార్చాలంటూ విద్యుత్తు డిఇ మండలంలోని అనంతవరం పంచాయతీ చెందిన గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1979లో వేసిన స్తంభాలు శిథిలావస్థ చేరడంతో చిన్నపాటి గాలివాన తొలిన సంబరాలు విరిగి పడిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పంట పొలాల్లో స్తంభాలు విరిగిపోవడం కరెంటు లేక చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని వారన్నారు. అనంతరం వారానికి ఉలవపాళ్ల ఒకే ఫ్రెండ్ కావడంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నరహరి హరిబాబు, అడపా వాసు, నరేష్, రమణీయ, తుదితరులు పాల్గొన్నారు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 425 / 2023

Andhra Pragathi Grameena Bank, Ramachandrapuram Branch, Nellore City, Represented by its **Branch Manager** - Plaintiff

Vs

Cherukuri Uma Maheswari - Defendant

Notice

To,
Cherukuri Uma Maheswari,
W/o **Yogaiah,** D.No.26/3/2297,
Sahithi Apartment, Railwaygate Road,
Vedayapalem, Nellore City,
SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే04-07-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

చుక్కా రమేష్, B.Com., B.L.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

Before The IV Addl. Motor Accidents Claims Tribunal : Nellore
M.V.O.P.No. 43 / 2023

Cherukuru Penchala Prasad - Claimant

Versus

1. **S.Sivakumar Reddy** and 2 others - Respondents

Notice

To,
R1. S.Sivakumar Reddy,
S/o Venkata Subba Reddy, Owner of the Tipper bearing No.OR16-D-6035,
Residing at D.No.27/2/1582,
Lakshmi Nagar, Balaji Nagar, Nellore City,
Andhra Pradesh - 524002.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే29-07-2024ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.ఉమామహేశ్వర్, బి.కాం., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ